"మిత్రమా! కోపం కన్నా మృదుత్వం, బలవంతం కన్నా మిత్రత్వం బలమైనవని తెలుసుకో."

## 79. పరమాత్మని చేరే ఓ దారిది

ఓ వర్షం రాత్రి ఓ పెద్దమనిషి బస్ స్టాప్‌లో వేచి ఉన్న ప్రయాణీకుల ముందు తన కారుని ఆపి, కొందరికి లిఫ్ట్ ఇచ్చాడు. కొద్ది దూరం వెళ్ళాక ఒకతను చెప్పాడు.

"నేరుగా పోనివ్వండి స్వామి. కుడివైపు తిరిగితే కిలోమీటరున్నర దూరం ఎక్కువ వెళ్ళాలి."

"నేరుగా వెళ్తే ఒన్-వే-ట్రాఫిక్ కదా!"

"ఇంత రాత్రి పోలీసులెవరూ ఉండరు."

ఆ పెద్దమనిషి కారుని కుడి వైపుకే తిప్పాడు. కొద్ది దూరం వెళ్ళాక ట్రాఫిక్ రెడ్ లైట్స్ దగ్గర అతను కారాపాడు .

"పోనివ్వండి. ఎర్ర లైటు వెలుగుతున్నా అటు, ఇటు ఏ వాహనాలూ లేవుగా." మరొకతను కొద్దిగా విసుగ్గా చెప్పాడు.

అయినా ఆకుపచ్చ లైటు వచ్చేదాకా ఆగి ఆ తర్వాతే కారుని పోనించాడాయన. కారు వాళ్ళ గమ్యస్థానం చేరాక వాళ్ళంతా 'థాంక్స్' చెప్తే ఆ పెద్దమనిషి వాళ్ళతో చెప్పాడు .

"నేను ట్రాఫిక్ రూల్స్‌ని ఖచ్చితంగా పాటించడం వల్ల మీరంతా అసహనానికి గురయ్యారు కదా? 'పట్టుబడం' అన్న సందర్భంలో కూడా ఏ తప్పూ చేయకూడదు అన్న నియమాన్ని నేను పాటిస్తాను. అప్పుడిక అవకాశం వచ్చిన పెద్ద నేరాన్ని చేయాలన్న ఆలోచనే రాదు. దీన్నే వాసనా, సంస్కారాలంటారు. చెడ్డ వాసనా, సంస్కారాలని కల్లో కూడా దగ్గరికి రానివ్వకూడదు. మనల్ని ఎవరైనా పర్యవేక్షించని సందర్భంలో కూడా

నిజాయితీగా ప్రవర్తించడం ద్వారా మనలో మంచి కేరక్టర్ రూపొందుతుంది. అదే మనల్ని పరమాత్మ దగ్గరకి తీసుకెళ్ళేది."

## 80. సింప్లి సిట్టింగ్ స్వామి

ఓ గుడి పాలకవర్గ అధ్యక్షుడు ఆ గుడిలో ఎవరెవరు ఏఏ పనులు చేస్తున్నారో విచారించాడు. పూజారి, వాచ్‌మేన్, పనిమనిషి లాంటి అనేకమంది చేసే పని గుడికి అవసరం అనుకున్నాడు. కాని, దేవుడి ప్రసాదం తింటూ, గుళ్ళో బస చేసే 'సింప్లి సిట్టింగ్ స్వామి' అనే అతను మాత్రం ఏ పనీ చేయడం లేదని తెలుసుకుని అతన్ని పిలిపించి చెప్పాడు.

"నీవల్ల గుడికేం లాభం కలగడం లేదు. ఇక నీకు ప్రసాదం పెట్టం. వేరే ఎక్కడికైనా వెళ్ళు."

"ఇదన్యాయం. నేను అందరికన్నా కష్టమైన పని చేస్తున్నాను." చెప్పాడు సన్న్యాసి.

"కష్టమైన పనా? నువ్వనలేం పనీ చేయక ఖాళీగా కూర్చుంటున్నావుగా?"

"సరే. మీరో పూట ఏ పనీ చేయకుండా దైవ చింతనతో ఖాళీగా కూర్చోండి. అది తేలికని మీకనిపిస్తే, అప్పుడు మీరు చెప్పినట్లే చేయండి."

ఆ అధ్యక్షుడు సరేనని, మర్నాడు ఉదయం ఇంట్లో ఏ పనీ చేయకుండా ఓ గదిలో కూర్చున్నాడు. గంటకి మించి అలా ఖాళీగా కూర్చోవడం ఆయన వల్ల కాలేదు. ప్రపంచంతో ప్రమేయం పెట్టుకోకుండా ఖాళీగా ఉండగలగడం ఎవరికీ సాధ్యం కాదని గ్రహించిన ఆ అధ్యక్షుడు, ప్రపంచం మీద కాక, తన మనసుని భగవంతుని మీద పెట్టగలిగిన 'సింప్లి సిట్టింగ్ స్వామి' చేసే పని ఎంతో కష్టమైనదని గ్రహించి అతన్ని గుళ్ళోనే ఉండమని కోరాడు.